పంచాయతీ తీర్మానం లేకుండా పనులు చేపట్టవద్దు

- మండల సర్వసభ్య సమావేశంలో జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్, పీఆర్ ఏఈ హరికృష్ణకు పలు సూచనలిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

మెరకముడిదాం: గ్రామాల్లో ఎస్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టే అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం తప్పనిసరని, తీర్మానం లేకుండా ఎట్టిపరిస్థితిలో పనులు మంజూరు చేయొద్దని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో స్థానిక జెడ్పీటీసీ, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పాల్గొని వివిధ శాఖల పగతి నివేదికలపై సమీక్షించారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించిన ప్రగతి నివేదికలను ఇన్‌చార్జ్ ఏపీఓ ఎ.నరేంద్రకుమార్, పంచాయతీరాజ్ ఏఈ హరికృష్ణ వివరిస్తుండగా జెడ్పీ చైర్మన్ కలుగజేసుకుని గోశాలల మంజూరు ఎంతవరకు వచ్చిందని ప్రశ్నించారు. ఇంతవరకూ పశువైద్యాధికారి తమకు ఎలాంటి ఎస్టిమేట్లు అందించలేదని ఇన్‌చార్జ్ ఏపీఓ నరేంద్రకుమార్ ఆయనకు తెలియజేశారు. వ్యవసాయశాఖపై చర్చ సందర్భంగా రైతులు సాగుచేస్తున్న ప్రతీ పంట ఈ–క్రాప్‌లో నమోదు చేయాలని, ప్రతీ రైతు ఈకేవైసీ పూర్తిచేసేలా చూడాలని వ్యవసాయశాఖ అధికారి శ్రావణితేజకు జెడ్పీ చైర్మన్ సూచించారు. వైద్యశాఖపై చర్చ సందర్భంగా గ్రామాల్లో సీజనల్ జ్వరాలు, డయేరియా వంటి అంటురోగాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అన్ని గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలని మెరకముడిదాం, గర్భాం వైద్యాధికారులను ఆదేశించారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు సరఫరా జరిగేలా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి సూచించారు. విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతోందని తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే కోతలు మొదలయ్యాయని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు మండిపడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఈబీ ఏఈ రమేష్‌కు సూచించారు. తహసీల్దార్ అజురఫీజాన్ రెవెన్యూ శాఖకు సంబంధించిన వివరాలు వెల్లడిస్తుండగా పలువురు సభ్యులు కలుగజేసుకుని ఆన్‌లైన్‌లో 1బీలు రావడం లేదని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తహసీల్దార్ స్పందిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా భూముల రీసర్వే పూర్తియిన గ్రామాల్లో ఆన్‌లైన్ 1బీలను ప్రభుత్వం నిలిపివేసిందని తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ జె.భాస్కరరావు, వైస్ ఎంపీపీ తలచుట్ల హరిబాబు, అన్ని శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో అందని వైద్యం

- ఇంటింటికీ ఆరోగ్యం అందించండి
- కూటమి ప్రభుత్వానికి జెడ్పీ చైర్మన్ హితవు


డయేరియా రోగులను పరామర్శిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


గుర్ల జెడ్పీ హైస్కూల్‌లో చికిత్స పొందుతున్న డయేరియా రోగులు

గుర్ల: పల్లెల్లో పండగ కాదు ఇంటింటికీ ఆరోగ్యం అందించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు కూటమి ప్రభుత్వానికి హితవు పలికారు. ఈ మేరకు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన డయేరియా వైద్య శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి, రోగులను పరామర్శించారు. రోగులకు ఆలసత్వం లేకుండా వైద్యం అందించాలని వైద్యాధికారులను కోరారు. ఆనంతరం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ప్రజలకు సకాలంలో వైద్యం అందడం లేదని అసహనం వెలిబుచ్చారు. డయేరియాతో ఐదుగురు మృతి చెందిన దానికి కారణం ప్రభుత్వమే అని మృతుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పల్లెల్లో పూర్తిగా పారిశుద్ధ్యం లోపించిందని ఆరోపించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందడం లేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పేద ప్రజలకు అనారోగ్యానికి గురైతే ఇంటికి వెళ్లి వైద్యం అందించామని, అలాంటి పరిస్థితి కూటమి ప్రభుత్వంలో కానరాదన్నారు. డయేరియా రోగులను సందర్శించిన వారిలో జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ సూర్యనారాయణ రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పొట్నూరు సన్యాసినాయుడు ఉన్నారు.

క్లుప్తంగా

మధుపాడలో డయేరియా!


సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చంద్రిబాబు

గంట్యాడ: మండలంలోని పెదమధుపాడ గ్రామంలో డయేరియా ప్రబలింది. గ్రామానికి చెందిన తెంటు చంద్రిబాబు అనే వ్యక్తి వారం రోజులు క్రితం వాంతులు, విరోచనాలతో ఎస్.కోట ఏరియా ఆస్పత్రిలో చేరాడు. అక్కడ నాలుగు రోజులు చికిత్స అనంతరం వ్యాధి తగ్గక పోవడంతో సర్వజన ఆస్పత్రికి రిఫర్ చేశారు. ప్రస్తుతం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నాడు.

సస్యరక్షణపై అవగాహన


వసాదిలో పంట తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త తేజేశ్వరావు

గంట్యాడ: మండలంలోని వసాది, మోకాలపాడు గ్రామాల్లో వ్యవసాయ అధికారులు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గాజులరేగ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త తేజేశ్వరావు వరి పంటలో చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.శ్యామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీచైర్మన్ పరామర్శ


శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు


మెరకముడిదాం: మండలంలోని పెదపూతికవలస గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బూరాడ శ్రీనివాసరావు గుండెపోటుతో మృతిచెందిన విషయం విధితమే. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు బుధవారం ఆ గ్రామానికి వెళ్లి శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు. అధైర్య పడొద్దని, అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, స్థానిక నాయకుడు ఎం.శ్రీనివాసరావు ఉన్నారు.

ముమ్మరంగా శానిటేషన్ పనులు


కాలువల్లో పూడికలు తొలగిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

గజపతినగరం: మండల కేంద్రంలోని పలు వీధుల్లో బుధవారం శానిటేషన్ పనులు చేపట్టారు. ఆస్పత్రి రోడ్డు, బూర్లివీధి, తదితర ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. కాలువల్లో పూడికలు తొలగించి సుదూర ప్రాంతాలకు తరలించారు. దోమలు, ఈగల నివారణకు రసాయన మందులు పిచికారీ చేశారు. పంచాయతీ సెక్రటరీ జనార్దనరావు పనులను పర్యవేక్షించారు.

మూడు అడుగుల ఎత్తులో అరటిగెల


అరటిమొక్క కాండం వద్ద కాసిన గెల

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన వేచలపు రామకృష్ణ తన కల్లంలో వేసిన అరటి మొక్క మూడు అడుగుల ఎత్తులోనే గెలవేయటం పలువురిని ఆకట్టుకుంటోంది. అరటిమొక్క సుమారు 8 అడుగుల ఎత్తు వరకు పెరిగింది. అయితే మొక్క మొదలు వద్ద మూడు అడుగుల ఎత్తులో కాండంలోంచి అరటిగెల రావడంతో చుట్టుపక్కల వారు దాన్ని ఆశ్చర్యంగా తిలకిస్తున్నారు.

ఈ-క్రాప్‌తో రైతులకు మేలు


ఈ-క్రాప్ జాబితాను ప్రదర్శిస్తున్న ఏడీఏ మహరాజన్

దత్తిరాజేరు: రైతులు తాము సాగుచేస్తున్న పంటలను ఈ–క్రాప్‌లో నమోదు చేసుకోవడం వల్ల పంట బీమాతో పాటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో పంటను విక్రయించుకునేందుకు వీలుంటుందని ఏడీఏ మహరాజన్ అన్నారు. పెదమానాపురం రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ–క్రాప్ ముసాయిదా జాబితాలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే తమ దృష్టికి తీసుకురావాలని రైతులకు సూచించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోతే ప్రభుత్వం పరిహారం ఇచ్చి రైతులను ఆదుకుంటుందన్నారు. అలాగే రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయన వెంట ఏఓ గోవిందమ్మ, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.

రాకపోకలకు ఇబ్బంది


రైల్వే వంతెన కింద చేరిన నీరు

జామి: మండలంలోని అలమండ పంచాయతీ పరిధిలో అలమండ–కుద్దుపాలెం మధ్య ఉన్న రైల్వే వంతెన కింద నీరు చేరడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కుద్దుపాలెం, నారాయణపురం గ్రామస్తులు రైల్వే ట్రాక్ దాటేందుకు ఈ అండర్‌పాస్ నిర్మించారు. అయితే వర్షంనీరుతో పాటు పక్కనే ఉన్న చెరువు, పొలాల్లో నుంచి వచ్చిన నీరు వంతెన కింద చేరుతోంది. మొకాలి లోతులో ఉన్న ఈ నీటిలో నుంచి రాకపోకలు సాగించేందుకు రెండు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినా వారి నుంచి సరైన స్పందన లేదని గ్రామస్తులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సి-బాట్‌లో ఎస్.కోట విద్యార్థుల సత్తా



రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శాంతి

శృంగవరపుకోట: పట్టణంలో స్థానిక కౌముది గ్లోబల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారని ప్రిన్సిపాల్ శాంతి మహంతి తెలిపారు. ఇటీవల హైదరాబాద్‌కి చెందిన ఈ–అభ్యాస్ అకాడమీ సెప్టెంబర్ 19న స్థానిక కౌముది గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించిన ఆచార్య చాణక్య బిజినెస్ అపిట్యూడ్ టెస్ట్(సి–బాట్)లో 54 మంది విద్యార్థులు పాల్గొనగా అందులో పాఠశాలకు చెందిన విద్యార్థులు పలిమెర వర్షిణి (1వర్యాంక్), శిరగం లక్ష్మీప్రణవి(2వ ర్యాంక్), వేచలపు సోహన్ (3వ ర్యాంక్) సాధించారన్నారు. విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు.

గ్రామ స్వరాజ్యం దిశగా 'పల్లెపండగ'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

శృంగవరపుకోట: గ్రామ స్వరాజ్యం సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె పండగ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. మండలంలోని రేవళ్లపాలెంలో బుధవారం పల్లెపండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, సర్పంచ్ జాగరపు కృష్ణమ్మ, ఎంపీటీసీ చప్ప లత, పీఆర్ జేఈ బి.వి.సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే సీతారాంపురం, కొట్టాం, మామిడిపల్లి గ్రామాల్లో కూడా పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు.

రోడ్డు పనులు పూర్తయ్యేదెప్పుడు?


అధ్వానంగా ఉన్న ఇంగిలాపల్లి-గదబవలస రోడ్డు

దత్తిరాజేరు: ఇంగిలాపల్లి– గదబవలస రోడ్డు పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయాలని వారంతా కోరుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గదబవలస గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. వర్షాకాలంలో వారి అవస్థలు అన్నీఇన్నీ కావు. తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్యను గ్రామస్తులు కోరడంతో ఆయన వెంటనే స్పందించారు. ఇంగిలాపల్లి గ్రామం ఆంజనేయస్వామి గుడి నుంచి చినచామలాపల్లి మీదుగా గదబవలస గ్రామం వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ఏపీఆర్‌ఆర్‌పీ నిధులు రూ.2.20 కోట్లు మంజూరు చేయించారు. కల్వర్టులు, మధువుల నిర్మాణం కోసం రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలు, డొంకలను తొలగించి రోడ్డును చదును చేయించారు. మార్చి నెలలో పనులు ప్రారంభించేందుకు గుత్తేదారు సిద్ధం కాగా.. ఈ లోగా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పనులు చేపట్టలేదు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణాన్ని పక్కనపెట్టేసింది. దీంతో తమ గ్రామానికి ఇప్పట్లో రోడ్డు వచ్చేలా లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ


పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న గురుకులాల జిల్లా కోఆర్డినేటర్ ఫ్లోరెన్స్

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను జిల్లా గురుకుల పాఠశాలల కోఆర్డినేటర్ టి.ఎం.ఫ్లోరెన్స్ బుధవారం సందర్శించారు. ఉపాధ్యాయుల రిజిస్టర్లతో పాటు లెసెన్ ప్లాన్ పరిశీలించారు. వసతి గృహంలో భోజన మెనూ అమలు తీరు, నాణ్యత, రుచిపై విద్యార్థులను ఆరాతీశారు. స్టాక్‌ను పరిశీలించి వార్డెన్‌కు పలు సూచనలు చేశారు. ఈనెల 18న నెల్లిమర్లలో జరిగే సైన్స్ ఫేర్‌కు పాఠశాల నుంచి ప్రాజెక్టు తయారు చేసిన తీసుకురావాలని, పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రణాళికతో కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ


వేపాడ: బోద్దాంలో సీసీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న సర్పంచ్ సత్యవతి


జామి: అట్టాడలో పల్లె పండగ కార్యక్రమంలో అధికారులు, నేతలు

వేపాడ: మండలంలో బొద్దాం గ్రామంలో నిర్మించనున్న సీసీరోడ్లుకు సర్పంచ్ ఎర్రా రామసత్యవతి, ఎంపీటీసీ దుల్ల లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి భారతి తదితరుల బుధవారం భూమిపూజ నిర్వహించారు. రూ.10 లక్షలు అంచనా వ్యయంతో రోడ్డు పనులు చేపడుతున్నట్లు చెప్పారు.

జామిలో..

జామి: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా అట్టాడ, కుమరాం గ్రామాల్లో సీసీరోడ్డు పనులకు ఎంపీడీఓ అప్పలనాయుడు బుధవారం భూమిపూజ చేశారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ కిరణ్మయి, తదితరులు పాల్గొన్నారు.

చిన్నతామారాపల్లిలో..


బొండపల్లి: చిన్నతామరాపల్లిలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బొండపల్లి: మండలంలోని చిన్నతామరాపల్లి గ్రామంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులుకు గ్రామ సర్పంచ్ నడుపూరి భాస్కరనాయుడు, ఎంపీడీఓ జి.గిరిబాల బుధవారం భూమిపూజ చేశారు. ఉపాధి నిధులు రూ.18 లక్షలతో ఆయా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ పి.అప్పలనాయుడు, ఏపీఓ బి.కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

వరిలో తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి


అర్తమూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ శైలజ

చీపురుపల్లి రూరల్(గరివిడి): వరిలో తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయాధికారి శైలజ సూచించారు. గరివిడి మండలం అర్తమూరు, కోనూరు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వరి పంటను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ ఏడాది వరి పంటలో ఎక్కువగా పొడ తెగులు(కుళ్లుతెగులు) కన్పిస్తోందన్నారు. వరి దుబ్బు కింద నుంచి మీద వరుకు రంగు మారి కుళ్లినట్లు కనిపిస్తే పొడతెగులుగా గుర్తించాలన్నారు. ఈ తెగులు నివారణకు హెక్సాకొనిజాల్ 20 ఎం.ఎల్ రసాయన మందును 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారీ చేయాలని సూచించారు. పంట చివర దశలో పొటాష్‌ను వినియోగిస్తే దిగుబడి పెరగడంతో పాటు తెగుళ్ల వ్యాపించే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పొన్నాడ కుమార్, ఎంపీటీసీ పతివాడ గురినాయుడు, రైతులు పాల్గొన్నారు.

పాడిరైతులను ఆదుకోవాలి


పాడిరైతుల సదస్సు గోడపత్రికలు విడుదల చేస్తున్న రైతు సంఘ నాయకులు

శృంగవరపుకోట: బీజేపీ ప్రభుత్వం పాడి ఉత్పత్తులపై జీఎస్టీ విధించడం, సహకార రంగ డెయిరీలను దెబ్బతీయడం, పాల ఉత్పత్తుల తయారీ పరికరాలపై పన్నులు పెంపు వల్ల రైతులు నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. మండలంలోని కృష్ణాపురం గ్రామంలో పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం వద్ద బుధవారం ఏపీ రైతు సంఘం నేతృత్వంలో గోడపత్రికలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంతో పాటు పాడిపరిశ్రమపై ఆధారపడి అనేక మంది జీవనోపాధి పొందుతున్నారని, ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఆయా రంగాలు పూర్తిగా కుదేలయ్యాయన్నారు. పాడిరైతుల వద్ద ఆవుపాలు రూ.34లు, గేదెపాలు రూ.39.50లు కొని మార్కెట్‌లో రూ.56లకు అమ్ముకుంటున్నారన్నారు. పాడి రైతులకు ప్రోత్సాహక ధర లీటరుకు రూ.8లు చెల్లించాలని, సహకార రంగ డెయిరీలను ప్రారంభించాలని కోరారు. పాడి రైతులను ఆదుకునే దిశగా అక్టోబర్ 18న ఉదయం 10గంటలకు జామిలో బూసర్ల రమణారావు కళ్యాణ మండపంలో జరిగే పాడిరైతులు సదస్సుకు రైతులంతా హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో సి.హెచ్.ముత్యాలు, కర్రి గణేష్, పి.అప్పలసత్యం, కొమ్మినేని లక్ష్మి, కె.లక్ష్మి, కె.నాయుడు, కృష్ణమ్మ, శివ తదితరులు పాల్గొన్నారు.

వీఆర్వోలు క్షేత్రపరిశీలన చేయాలి


వీఆర్వోలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్ రత్నకుమార్

గజపతినగరం: గజపతినగరం రెవెన్యూ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న గ్రామ రెవెన్యూ అధికారులంతా ఫీల్డ్‌లోకి (పొలంలోకి) వెళ్లకుండా ఎటువంటి పనులు చేయరాదని స్థానిక తహసీల్దార్ బి.రత్నకుమార్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో రికార్డులు పారదర్శకంగా లేవని, భూములు సాగు చేస్తున్నది ఒకరైతే పట్టాదారుని పేరు మరొకరిది ఉన్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అటువంటి వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవాలు తెలుసుకోవాలని వీఆర్వోలకు సూచించారు. ఫీల్డ్‌కు వెళ్లికి రికార్డులతో పాటు ఎఫ్ఎంబీలను సరిచూసి పూర్తి వివరాలతో నివేదికలు అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శోభారాణి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

నేడు 'గ్రామ సందర్శన'

చీపురుపల్లి: మండలంలోని దేవరపొదిలాం గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సరళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు.

కిత్తన్నపేటలో..

లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్నపేట గ్రామంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్.అప్పారావు బుధవారం ఒక ప్రకటణలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు విధిగా హాజరు కావాలన్నారు. అలాగే గ్రామంలో ఉదయం 8 గంటల నుంచి పశువైద్య శిబిరం, వైద్య శిబిరాలను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

చింతాడలో..

జామి: మండలంలోని చింతాడ గ్రామంలో గురువారం గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అప్పలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు పూర్తి సమచారంతో హాజరు కావాలని సూచించారు. గ్రామంలో ఎటువంటి సమస్యలు ఉన్నా వాటిని అధికారులు దృష్టికి తీసుకురావాలని గ్రామస్తులను కోరారు.

కె.కృష్ణాపురంలో..

దత్తిరాజేరు: మండలంలోని కోరపు కృష్ణాపురంలో గురువారం ఉదయం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, రేషన్ షాపును తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

సర్టిఫికెట్లు తీసుకోండి

చీపురుపల్లి: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఓపెన్ స్కూల్ విధానం ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలను పొందాలని ఓపెన్ స్కూల్ సహాయ సమన్వయకర్త కాపరోతు మురళీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఇరవై సంవత్సరాలుగా ఇక్కడ ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్మీడియట్ చదివి ఉత్తీర్ణత సాధించిన వారి ధ్రువపత్రాలు పాఠశాలలో సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. అక్టోబర్ 30లోగా వాటిని తీసుకోవాలని కోరారు.

డయేరియాపై అప్రమత్తం

చీపురుపల్లి: చీపురుపల్లి మండలంలో డయేరియా వ్యాప్తి చెందకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు ఇప్పిలి నీలకంఠం కోరారు. ఇప్పటికే గుర్ల మండలంలో డయేరియా కారణంగా వందలాది మంది మంచాన పడగా, ఐదుగురు వరకు మృతి చెందిన సంగతి తెలిసిందే. ఇప్పటికైనా వైద్య, ఆరోగ్యశాఖ యంత్రాంగం తేరుకుని వ్యాధి ప్రబలకముందే నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

కొత్తవలస: మండలంలోని నిమ్మలపాలెం, గొల్లలపాలెం, దేవాడ గ్రామాల్లో రూ.41 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్లు, డ్రైనేజ్ పనులకు స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి బుధవారం శంకుస్థాపన చేశారు. పనులు సకాలంలో పూర్తిచేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

లక్కవరపుకోట: మండలంలోని మల్లివీడు సమీపంలో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ (33/11 కేవీ) పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ ఐ.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లైన్‌లో వైర్లపై ఉన్న చెట్టుకొమ్మల తొలిగింపు, ఫీడర్ మరమత్తులు చేపట్టనున్నట్లు చెప్పారు. జమ్మాదేవిపేట, రంగాపురం, వేచలపువానిపాలెం, గేదెలవానిపాలెం, గనివాడ, రెల్లిగౌరమ్మపేట, శ్రీరాంపురం, కొత్తపాలెం, తామరాపల్లి, మార్లపల్లి, లింగంపేట, చందులూరు, కిత్తన్నపేట, దాసుళ్లపాలెం తదితర గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటవరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.